విలీనంపై విముఖత

- పరిగి మున్సిపల్‌లోకి ఆరు కొత్త గ్రామాలు
- గ్రామసభల్లో విలీనంపై వ్యతిరేకత
- మొండిగా వ్యవహరిస్తూ విలీనానికి ప్రభుత్వ నిర్ణయం

పరిగి మున్సిపల్ కార్యాలయం

పరిగి, డిసెంబర్ 22 : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజాభిప్రాయాన్ని కాలరాయడం గత ఏడాదిగా చూస్తూనే ఉన్నాం. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వాలు ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా పాలన సాగించినప్పుడే ఆ పాలన ప్రజారంజకంగా పది కాలాలపాటు నిలుస్తుంది. ప్రజలు వ్యతిరేకిస్తున్నా పట్టించుకోకుండా తమ నిర్ణయాలను ప్రజలపై రుద్దే ప్రయత్నం చేయడం సరైంది కాదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాభిప్రాయానికి వ్యతిరేకమైన నిర్ణయాలే అధికంగా తీసుకుంటుండడం గమనార్హం. పరిగి మున్సిపాలిటీలో 6 గ్రామాల విలీనం ఇదే కోవలోకి వస్తుంది. పేరుకు ఆరు గ్రామాలైనా ఒక గ్రామంలో ప్రజలెవరూ ఉండరు, కేవలం భూములు ఉంటాయి. మిగతా అయిదు గ్రామాల వారు తమను మున్సిపాలిటీలో కలపవద్దని విన్నవిస్తున్నా పట్టించుకోకుండా నిర్ణయించడం తీవ్ర విమర్శలకు తావిస్తుస్తుది.

పరిగి మున్సిపల్‌లోకి 6 గ్రామాలు...

పరిగి మున్సిపల్‌కు 5 కిలోమీటర్ల పరిధిలో ఉన్న 6 గ్రామాలను మున్సిపల్‌లో విలీనానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పరిగి మున్సిపాలిటీకి 5 కిలోమీటర్ల పరిధిలోని నస్కల్, రుక్కుంపల్లి, సుల్తాన్‌పూర్, సయ్యద్‌మల్కాపూర్, నజీరాబాద్, శాఖాపూర్ గ్రామాలను మున్సిపాలిటీలో విలీనానికి ప్రతిపాదించారు. నస్కల్ గ్రామంలో 964 కుటుంబాలుండగా 2,606 మంది ఓటర్లు, నజీరాబాద్‌లో 388 కుటుంబాలుండగా 1,035 మంది ఓటర్లు, సుల్తాన్‌పూర్‌లో 585 కుటుంబాలుండగా 1,606 మంది ఓటర్లు, సయ్యద్‌మల్కాపూర్‌లో 327 కుటుంబాలుండగా 830 మంది ఓటర్లు, రుక్కుంపల్లిలో 198 కుటుంబాలుండగా 573 మంది ఓటర్లు ఉన్నారు. శాఖాపూర్‌లో నివాసాలు ఏమీ లేకపోగా ఈ గ్రామ పరిధిలో భూములు ఉన్నాయి. ఈ మేరకు 6 గ్రామాలను పరిగి మున్సిపాలిటీలో విలీనం చేసేందుకు సంబంధించిన ప్రతిపాదన ప్రభుత్వానికి అందగా సీడీఎంఏ నుంచి అధికారులు పరిగి మున్సిపల్ అధికారులను పూర్తి వివరాలు కోరడంతో పంపించారు. మరోవైపు అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఆరు గ్రామాలను పరిగి మున్సిపాలిటీలో కలపాల్సిందిగా ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. పట్టణీకరణలో భాగంగా ఆరు గ్రామాలను మున్సిపల్‌లో విలీనం చేయాల్సిందిగా ఎమ్మెల్యే పేర్కొన్నారు.

విలీన గ్రామాల్లో ఉపాధిహామీకి రాంరాం

పేదలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ఉపాధి హామీ పథకం కేవలం గ్రామ పంచాయతీల్లోనే అమలులో ఉంటుంది. మున్సిపాలిటీల పరిధిలో ఈ పథకం వర్తించదు. ఏదైనా గ్రామాన్ని మున్సిపాలిటీలో కలిపితే సంబంధిత గ్రామంలో ఉపాధిహామీ పథకం నిలిపివేస్తారు. తద్వారా పేద కూలీలకు పని లభించకుండా పోతుంది. మున్సిపాలిటీలో విలీనమయ్యే గ్రామ పంచాయతీల్లో రాబోయే ఐదేండ్ల పాటు ఉపాధి హామీ పథకం అమలు చేయాలని అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అసెంబ్లీలో కోరినప్పటికీ అందుకు అనుగుణంగా ఎలాంటి నిర్ణయాలు వెలువడలేదు. దీంతో విలీన గ్రామాల్లో ఉపాధిహామీ పథకం అమలు అటకెక్కనుంది. ఒక్కసారిగా ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పథకం అమలు పరిశీలిస్తే సయ్యద్‌మల్కాపూర్‌లో 249 జాబ్‌కార్డులుండగా 90 కార్డులు యాక్టివ్‌గా ఉండి 382 మంది కూలీలు గతేడాది 9283 పనిదినాలు చేశారు. సుమారు రూ.24లక్షల విలువ చేసే పనులు జరిగాయి. సుల్తాన్‌పూర్‌లో 298 కార్డులుండగా 150 కార్డులు యాక్టివ్‌గా ఉండి 233 మంది కూలీలు సంవత్సరంలో రూ.15.63లక్షలు విలువ చేసే 5971 పనిదినాలు పనిచేశారు. నజీరాబాద్‌లో 330 కార్డులుండగా 296 యాక్టివ్‌గా ఉండి 586 మంది కూలీలు సంవత్సరంలో రూ.33.91లక్షలు విలువ చేసే 12728 పనిదినాలు చేయడం గమనార్హం. రుక్కుంపల్లిలో 202 కార్డులుండగా 94 యాక్టివ్‌గా ఉండి 181 మంది కూలీలు 2464 పనిదినాలు చేయగా రూ.5.08 లక్షల పని జరిగింది. నస్కల్ గ్రామంలో 600 జాబ్‌కార్డులుండగా 379 కార్డులు యాక్టివ్‌గా ఉండడంతో 646 మంది కూలీలు 10,872 పనిదినాలు చేయడంతో రూ.44.75లక్షలు పనిచేయడం జరిగిందని చెప్పవచ్చు. ఐదు గ్రామాల్లో కలిపి గతేడాది 2028 మంది కూలీలు 41,318 పనిదినాలు పని చేశారు. ప్రధానంగా నస్కల్, రుక్కుంపల్లి, సుల్తాన్‌పూర్‌లలో వివిధ రకాల పంటలు, కూరగాయలు పండిస్తారు. అయినప్పటికీ కూలీలకు ఉపాధి లేని సమయంలో ఉపాధిహామీ పథకం పని కల్పిస్తుంది. మున్సిపాలిటీలో ఈ గ్రామాల విలీనంతో తమకు ఉపాధి కరువవుతుందని వారు వాపోతున్నారు.

పెరగనున్న పన్నులు

గ్రామపంచాయతీలను మున్సిపాలిటీలలో విలీనం తర్వాత పన్నులు ఒక్కసారిగా పెరుగుతాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామపంచాయతీల్లో ఇంటిపన్నులు, ఇతర పన్నులు తక్కువగా ఉండగా మున్సిపాలిటీలో చాలా ఎక్కువగా ఉంటాయని పేర్కొంటున్నారు. పరిగి మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత నాలుగేండ్ల నుంచి పన్నులు పెంచకపోగా ఇటీవలే ఇంటి పన్నులు ఒక్కసారిగా పెరిగాయి. ఇతర వ్యాపార లైసెన్సు ఫీజులు, ఇంటి నిర్మాణ అనుమతుల ఫీజులు, ఇతర పన్నుల భారం తమపై పడుతుందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. గ్రామాల్లో తమ దగ్గర డబ్బులు ఉన్నపుడే పన్నులు చెల్లించేవారమని, మున్సిపాలిటీల్లో పన్నుల చెల్లింపుపై ఏకంగా నోటీసులు ఇస్తుండడం ద్వారా పెరిగిన పన్నులు చెల్లించాల్సి వస్తుందేమోనని వారు పేర్కొంటున్నారు.

మొదటి నుంచి వ్యతిరేకతే..

ఆరు గ్రామాలను పరిగి మున్సిపాలిటీలో విలీనం చేయనున్నారని తెలిసినప్పటి నుంచి ఆయా గ్రామాల ప్రజలు మున్సిపాలిటీలో తమ గ్రామాల విలీనంపై విముఖత చూపిస్తున్నారు. ముందుగా నస్కల్ గ్రామంలో పార్టీల కతీతంగా గ్రామసభ నిర్వహించి తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో కలపరాదని తీర్మానించడంతోపాటు స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, జిల్లా అధికారులకు తీర్మానం కాపీని అందజేశారు. ఇటీవల రుక్కుంపల్లి గ్రామంలోనూ మున్సిపాలిటీలో విలీనాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానించి గ్రామపంచాయతీ కార్యదర్శికి అందజేశారు. సుల్తాన్‌పూర్‌తోపాటు ఇతర గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో మున్సిపాలిటీలలో విలీనానికి వ్యతిరేకంగా ఆయా గ్రామాల మెజారిటీ ప్రజలు అభిప్రాయం తెలియజేశారు. అయినప్పటికీ ఆరు గ్రామాలను పరిగి మున్సిపాలిటీలో విలీనానికి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించడం సరైంది కాదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా ప్రభుత్వ నిర్ణయం ఉండాలి తప్పా ఇష్టారాజ్యంగా చేస్తే ఎలా అని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆరు గ్రామాలను పరిగి మున్సిపాలిటీలో విలీనం ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని వారు కోరుతున్నారు.

బీఆర్ఎస్ హయాంలో..

2018 ఆగస్టు 2వ తేదీన పరిగి మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటివరకు గ్రామపంచాయతీగా కొనసాగిన పరిగి మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత 15 వార్డులు ఏర్పాటు చేశారు. 2020 జనవరిలో మున్సిపాలిటీకి ఎన్నికలు జరిగాయి. పరిగి మున్సిపాలిటీ మొదటి చైర్మన్‌గా ముకుంద అశోక్ ఎన్నికయ్యారు. పరిగి మున్సిపల్ పరిధిలో 15 వార్డులు ఉండగా 5,132 కుటుంబాలు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం పరిగి జనాభా 18,241 ఉండగా ప్రస్తుతం సుమారు 30వేల మంది జనాభా ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. పరిగి మున్సిపాలిటీలో తాజా గణాంకాల ప్రకారం మొత్తం 18,241 మంది ఓటర్లుండగా వారిలో పురుషులు 10,112 మంది, మహిళలు 9,953 మంది ఉన్నారు. 2025 జనవరిలో ప్రస్తుత పాలకవర్గం పదవీకాలం ముగియనుంది. మున్సిపాలిటీ ఏర్పడిన ఐదేండ్ల తర్వాత 5 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలను ఆయా గ్రామాల్లో గ్రామసభల తీర్మానం మేరకు పురపాలక సంఘంలో విలీనం చేయవచ్చు. కాగా ప్రస్తుతం గ్రామాల్లో సర్పంచ్‌లు లేకపోవడంతో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించి ప్రజల అభిప్రాయాల సేకరణ మేరకు విలీనం జరపాల్సి ఉండగా ప్రభుత్వం ప్రజల నిర్ణయాలకు వ్యతిరేకంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తుంది.

ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి

పరిగి మున్సిపాలిటీలో గ్రామపంచాయతీల విలీనం అంశంలో ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి. గ్రామపంచాయతీలను మున్సిపాలిటీలలో విలీనం చేయడంతో ప్రజలపై పన్నుల భారం విపరీతంగా పెరిగిపోతుంది. ఉపాధి హామీ చట్టం నిలిచిపోయి కూలీలకు ఉపాధి లేకుండా పోతుంది. ఇలాంటి పరిస్థితిలో తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో కలపవద్దని గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఎమ్మెల్యే, కలెక్టర్‌కు విన్నవించాం. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా గ్రామపంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేసే ప్రక్రియను ఉపసంహరించుకోవాలి. **- మేడిద రాజేందర్, నస్కల్ గ్రామం**

ప్రజలపై భారం మోపడమే

గ్రామపంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేయడం ప్రజలపై నేరుగా పన్నుల భారం మోపడమే. మున్సిపాలిటీలో కలిస్తేనే అభివృద్ధి అనడం సరి కాదు. అభివృద్ధి చేయాలనుకున్నపుడు ప్రత్యేకంగా గ్రామపంచాయతీలకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయవచ్చు. మున్సిపాలిటీలో గ్రామాల విలీనంతో ప్రజలపై వివిధ రకాల పన్నుల భారంతోపాటు ప్రతి చిన్న పనికి పరిగికి వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటివరకు ఏ పని ఉన్నా గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్తే సరిపోయేది. విలీనం తర్వాత ప్రతి చిన్న పనికి పరిగికి వెళ్లడం ద్వారా సమయం సైతం వృథా అవుతుంది.

- టి.ప్రదీప్‌కుమార్‌రెడ్డి, సుల్తాన్‌పూర్

వికారాబాద్ : వెంకటస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది

వెంకటస్వామి అడుగుజాడల్లో నడుద్దాం

వికారాబాద్, డిసెంబర్ 22 : కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి అడుగు జాడల్లో నడుస్తూ.. ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ సుధీర్, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి మల్లేశం, డీవోఎస్‌వో హనుమంత రావు అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ హాల్‌లో ఆదివారం వెంటకస్వామి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో శుక్రవర్ధన్ రెడ్డి, హాస్టల్ వార్డెన్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిగిలో..

పరిగి : మాల మహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు, కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి వర్ధంతిని ఆదివారం పరిగిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఇరువురి చిత్రపటాలకు మాల మహానాడు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరిగిలోని బాలసదనంలో విద్యార్థినులకు అరటి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు చౌడాపూర్ వెంకటేశ్, ఎం కెపల్లి శ్రీనివాస్, ఆర్.రాములు, అనంతరాములు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బంట్వారంలో..

బంట్వారం : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఆదివారం మాజీ మంత్రి వెంకటస్వామి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదగిరి, గ్రంథపాలకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీసుల ఆత్మీయ సమ్మేళనం..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన 1991 పోలీస్ కానిస్టేబుల్ బ్యాచ్‌కు చెందిన మహిళా పోలీసులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అంకుషాపూర్‌లోని శ్రీనిధి రిసార్ట్స్‌లో ఆత్మీయ సమ్మేళనం జరుపుకుని.. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఉద్యోగంలో చేరిన తర్వాత నుంచి ప్రస్తుత తమ పరిస్థితులను సమీక్షించుకుని అనందోత్సహాల మధ్య ఆటపాటలతో సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా సదరు మహిళా పోలీస్ అధికారులు.. తమకంటే ముందు బ్యాచ్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రథమ మహిళా పోలీస్ అధికారులు పద్మ, హైమావతి, శ్యామలను గౌరవంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో 31 మంది మహిళా పోలీస్ అధికారులు పాల్గొన్నారు. *– ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 22*

మూడు రోజుల క్రితం అదృశ్యమై శవమై తేలాడు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 22 : మూడు రోజుల క్రితం అదృశ్యమైన వ్యక్తి ఆదివారం ఎయిర్‌పోర్టులోని నిర్మానుష్య ప్రాంతంలో శవమై కనిపించాడు. ఆర్‌జీఐఏ పోలీసుల వివరాల ప్రకారం.. మూడు రోజుల క్రితం శంషాబాద్ మండలంలోని పాలమాకుల గ్రామానికి చెందిన వెంకటయ్య గౌడ్(67) మానసికంగా ఇబ్బందులు పడుతుండడంతో కుటుంబ సభ్యులు దవాఖానకు తీసుకువెళ్లి..తిరిగి వస్తున్న క్రమంలో శంషాబాద్‌లో బస్సు దిగిన వెంకటయ్యగౌడ్ కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆర్‌జీఐఏ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని ప్రధాన ద్వారం వద్ద సెక్యూరిటీకి దుర్వాసన రావడంతో వెళ్లి చూడగా ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఘటనా స్థలానికి చేరుకున్న వారు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వెంకటయ్యగౌడ్‌గా గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

ఏఎన్ఎంల రాత పరీక్ష రద్దు చేయాలి

వికారాబాద్, డిసెంబర్ 22 : కాంట్రాక్టు ఏఎన్ఎంలకు ప్రభుత్వం నిర్వహిస్తున్న రాత పరీక్షను వెంటనే రద్దు చేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు ఏఎన్ఎంలు వినతిపత్రాన్ని అందజేశారు. ఆదివారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని గెరిగెట్‌పల్లిలో నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి స్పీకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎన్నో రోజులుగా సమ్మె చేస్తున్న ఏఎన్ఎంల సమస్యను పట్టించుకోవాలని స్పీకర్‌ను కోరారు. ఈ నెల 29న నిర్వహించే రాత పరీక్షను రద్దు చేసి.. అందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో మెడికల్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు లీలావతి, ఏఎన్ఎంలు వెంకటమ్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ తదితరులు ఉన్నారు.

PUBLIC NOTICE

It is here by informed to General public, My Client Derengula Raju Father Late Derengula Buggaiah, Occu: Stone Cutter, R/o H.No.12-59/8/13, Tilak Nagar, Kalwakurthy Town & Mandal, Nagarkurnool Dist, Telangana State is the owner of the Open Plot No. 19 an admeasuring 183 Sq.Yards in Sy.No.21, Situated at Kalwakurthy Town Limits of Kalwakurthy Mandal, Nagarkurnool Dist, Telangana State and after his death the above plot came to my client as Succession and inheritance. But on 10-12-2024 while my client get down in a RTC Bus at Amangal Bus stand to reach relatives house at Amangal Town, he was lost the above his Open Plot Original Registered Sale Deed vide Document No. 2027/1982 even after his through search and efforts it was not traced out as such if anybody have seen or found the above mentioned Registered Sale Deed vide Document No. 2027/1982 the same may informed or handover to the below address, the informer will get appropriate reward.

J. SHANKARAIAH Advocate / Notary
Kalwakurthy Town & Mandal, Nagarkurnool Dist, Telangana State. Cell Nos. 9394825107, 9110311077

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
EDUCATION
★రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr. J S అకాడమి (ISO 9001 : 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112
NT-337306

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

దోర్నాల్‌పల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి

దోమ, డిసెంబర్ 22 : అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబానికి కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం దోమ మండల పరిధిలోని దోర్నాల్‌పల్లి గ్రామానికి చెందిన నితిన్ సాగర్ అమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని ట్రస్ట్ సభ్యుల ద్వారా తెలుసుకున్నారు. చైర్మన్ వారి ఇంటికి వెళ్లి ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని వైద్య ఖర్చులకు రూ.25వేలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మేకల నర్సింహులు, మణికంఠ, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెంగోల్‌లో వ్యక్తి ఆత్మహత్య

తాండూరు రూరల్, డిసెంబర్ 22 :ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కరణ్‌కోట పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. తాండూరు మండల పరిధిలోని చెంగోల్ గ్రామానికి చెందిన నర్సగళ్ల రమేశ్ (33)కు 12 ఏండ్ల క్రితం కర్ణాటక రాష్ట్రంలోని మిరియానం గ్రామానికి చెందిన అనితతో పెండ్లి జరిగింది. కొంత కాలంగా వారి సంసారం బాగానే ఉంది. నాలుగేండ్ల క్రితం సంసారంలో గొడవలు చోటుచేసుకోవడంతో ఆయన భార్య అనిత పుట్టింటికి వెళ్లింది. ఇంటికి తిరిగి రావాలని రమేశ్‌తోపాటు కుటుంబ సభ్యులు సర్ది చెప్పారు. అయినా భార్య కాపురానికి రాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన తాగుడుకు బానిసయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దులానికి చీరతో ఉరేసుకున్నట్లు తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

డ్రై క్లీనింగ్ షాపులో అగ్ని ప్రమాదం

మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది.

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 22: ప్రమాదవశాత్తు ఓ డ్రై క్లీనింగ్ షాపులో ఆదివారం ఉదయం అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నది. బాధితుల వివరాల ప్రకారం.. అత్తాపూర్ తేజస్వీనగర్ కాలనీలోని ఎంఎం ఫ్యాబ్రిక్ పేరుతో డ్రై క్లీనింగ్ షాపు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి షాపు బంద్ చేసిన యజమాని ఇంటికి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం ఒక్కసారిగా షాపులో నుంచి మంటలు వస్తుండడంతో స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే రాజేంద్రనగర్ ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. షాపులో ఉన్న సామగ్రి, బట్టలు పూర్తిగా దగ్ధమైయ్యాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి ఉండవచ్చునని భావిస్తున్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలి

- అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండించిన నాయకులు
- నివాళులర్పించి.. నిరసన వ్యక్తం చేసిన నాయకులు

బొంపల్లిలో అంబేద్కర్ విగ్రహం ముందు అమిత్‌షా దిష్టి బొమ్మను దహనం చేస్తున్న అంబేద్కర్, మైనార్టీ సంఘాల నాయకులు

దోమ, డిసెంబర్ 22 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను రాజ్యసభలో అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని అంబేద్కర్, మైనార్టీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో అంబేద్కర్, మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీఆర్ అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలు సరి కాదన్నారు. అంబేద్కర్‌ను కించపరిచేలా దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసిన అమిత్ షా చేసిన వ్యాఖ్యలను సంఘం తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అంబేద్కర్‌ను అవమానిస్తే దేశం సహించబోదన్నారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. మతోన్మాద మంత్రికి బుద్ధి ప్రసాదించాలని వారు ఎద్దేవా చేశారు. దేశానికి దిశా నిర్దేశం చేసిన అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పి తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాములు, మైనారిటీ నాయకులు బాబర్, షేర్‌ఖాన్, తెలంగాణ ఉద్యమకారుడు రామన్న మాదిగ, జంగయ్య, శ్రీకాంత్, నర్సింహులు, రియాజ్, ఫెరోజ్, విజయ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

పూడూరు, డిసెంబర్ 22 : రైతులు పండించిన మొక్కజొన్నను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ పార్టీ రైతు సంఘం నాయకుడు బుచ్చన్న ఓ ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రైవేట్ వ్యాపారులు ఇష్టానుసారంగా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే రైతుకు న్యాయం జరిగేలా సీసీఐ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలని ఆయన కోరారు.

ఆత్మరక్షణకు తైక్వాండో నేర్చుకోవాలి

తైక్వాండ్‌లో రాణించిన విద్యార్థులకు వివిధ రకాల బెల్టులను బహూకరించిన దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 22: విద్యార్థులు ఆత్మరక్షణ కోసం తైక్వాండో నేర్చుకోవాలని తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏ.ప్రవీణ్‌కుమార్ సూచించారు. అత్తాపూర్‌లోని టెంపుల్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్‌లో తైక్వాండో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చీఫ్ ఎగ్జామినర్‌గా ఏ.ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా తైక్వాండోను నేర్చుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా కోచ్‌లు ఎస్.ప్రదీప్‌కుమార్, బి.సురేశ్‌లను ఆయన అభినందించారు. అనంతరం విద్యార్థులకు కలర్ బెల్టులను బహూకరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్స్ వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962